క్లుప్తంగా

జనహిత సుదర్శన హోమం



నాచగిరిలో యాగం నిర్వహిస్తున్న యాజ్ఞికులు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరిలో రెండోరోజు మంగళవారం సుదర్శన హోమం జరిగింది. యాజ్ఞికులు యాగశాల మండపం వద్ద నృసింహనామాలు పఠిస్తూ ఉదయం హోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. శ్రావణమాసంలో జనహితం కోసం నిర్వహిస్తున్న యాగం ఎంతో శుభప్రదమని వేదపండితులు తెలిపారు.

జెడ్పీ సీఈఓ పర్యటన



కొండాపూర్ గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీసీఈఓ

మద్దూర్(హుస్నాబాద్): మండలంలోని కొండాపూర్, దుబ్బతండ గ్రామాల్లో జెడ్పీసీఈఓ రమేష్ మంగళవారం పర్యటించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ కోసం వారి పని విధానం మదింపు చేసేందుకు వచ్చారు. అలాగే నర్సరీ, పల్లె ప్రకృతి వనం, గ్రామ పంచాయతీ రికార్డ్స్, క్రీడా ప్రాంగణం, స్మశాన వాటికను పరిశీలించారు. ఆయనతో పాటు సర్పంచులు, ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీఓ కాజ మొయినొద్దీన్ ఉన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు



హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించడంపై మంగళవారం మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనను మొదటి నుంచి ప్రోత్సహిస్తు వస్తున్న మంత్రికి రుణపడి ఉంటానన్నారు.

బీసీ ఎమ్మెల్యే అభ్యర్థినే ఎన్నుకుందాం



గోవర్ధనగిరిలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో మంగళవారం పల్లె పల్లెకు బీసీ చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ బీసీల సామాజిక ఉనికి, ఐక్యతను చాటేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలంతా ఐక్యమత్యంగా ఉండి సత్తా చాటుతామన్నారు. హుస్నాబాద్‌లో ఈసారి బీసీ ఎమ్మెల్యే అభ్యర్థినే ఎన్నుకుందామన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పూదరి రవీందర్, ఇల్లందుల సత్తన్న, ఇసంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



వృద్ధుడితో మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

కోహెడరూరల్(హుస్నాబాద్): ఇచ్చిన హామీలు అమలు చేయడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో పల్లెపల్లెకు ప్రవీణన్న..గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



శ్రీకాంత్

తొగుట(దుబ్బాక): తొగుట తహసీల్దార్‌గా కళ్యాణపు శ్రీకాంత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కరీంనగర్ జిల్లా నుంచి పదోన్నతిపై వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ జహీర్ బాధ్యతలు నిర్వహించారు.

మైనంపల్లి వ్యాఖ్యలపై మండిపాటు

దిష్టిబొమ్మల దహనాలతో నిరసన వెల్లువ



హుస్నాబాద్‌లో హన్మంతరావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటకమాన్: మంత్రి హరీశ్‌రావుపై అనుచిత వాఖ్యలు చేసిన మైనంపల్లి హన్మంతరావును బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట అంబేద్కర్ సర్కిల్‌లో బీఆర్ఎస్ నాయకుడు మరుపల్లి శ్రీనివాస్‌గౌడ్ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనంపల్లి హనుమంతరావు మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకుని హరీశ్‌రావుకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాష్ట్రంలో ఎక్కడా తిరగనివ్వకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటామని అన్నారు.

హుస్నాబాద్: మంత్రి హరీశ్‌రావుపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఆయన దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీ లకావత్ మానస, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): మంత్రి హరీశ్‌రావును విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకులేదని ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ అన్నారు. కుకునూరుపల్లిలో మంగళవారం మాట్లాడుతూ సీమాంధ్ర పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారినా హరీశ్‌రావు పెద్ద మనసు చేసుకోవడంతో ఎమ్మెల్యేగా కొనసాగుతున్న విషయాన్ని మైనంపల్లి మర్చిపోవడం బాధాకరమన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మంత్రి హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కొమురవెల్లి మల్లన్న ఆలయ చైర్మన్ గీస భిక్షపతి డిమాండ్ చేశారు. మంగళవారం మైనంపల్లి హన్మంతరావు దిష్టి బొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిద్దప్ప, వైస్‌ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మంత్రి హరీశ్‌రావుపై మైనంపల్లి హన్మంతరావు వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం చిన్నకోడూరులో, చౌడారంలో మైనంపల్లి దిష్టిబొమ్మలకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మద్దూర్(హుస్నాబాద్): మంత్రి హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దిష్టిబొమ్మను మంగళవారం మద్దూర్‌లో దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సుమలతమల్లేశం పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: మచ్చలేని నేత మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు చేస్తే తగిన గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకుడు, మాజీ జెడ్పీటీసీ అబ్బుల రాజలింగంగౌడ్, దుబ్బాక మండల బీఆర్ఎస్ అధ్యక్షులు బానాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు పడాల నరేష్ మాట్లాడారు. రాజకీయ భిక్షపెట్టిన హరీశ్‌రావు మీద విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మంత్రి హరీశ్‌రావుపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేసిన అనుచిత వ్యాఖ్యల్ని ఖండిస్తూ బీఆర్ఎస్ నాయకులు స్థానిక పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు అనంతుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాలనర్సయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మాట్లాడుతున్న సర్దార్‌ఖాన్

రుణమాఫీ పేరుతో మోసం

గజ్వేల్‌రూరల్: రుణమాఫీ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ ఆరోపించారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదిన్నరేళ్ల గడిచినా పూర్తి స్థాయిలో మాఫీ చేయలేకపోయిందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కొత్తగా రుణమాఫీ చేస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ బ్యాంకుల్లో తీసుకున్న వడ్డీ మాత్రం అలాగే మిగిలిపోయిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీట్ల కేటాయింపులో మొండిచేయి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల ప్రకటనలో వెనుకబడిన తరగతుల, మైనార్టీలకు మొండి చేయి చూపించిందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ విమర్శించిందన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో 80 శాతం ఉన్న బీసీలకు సీట్ల కేటాయింపులో ఎనిమిది శాతం టికెట్ కూడా కేటాయించలేదని, మైనార్టీలకు మొండి చేయి చూపిందన్నారు. బడుగు, బలహీన, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ మాత్రమే అండగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

మధ్యంతర భృతి ప్రకటించాలి



దుబ్బాకలో ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకుంటున్న టీపీటీఎఫ్ నాయకులు

దుబ్బాక: ప్రభుత్వం పీఆర్సీ కమిటీని నియమించి మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకుడు తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం దుబ్బాక పట్టణంతోపాటు మండల పరిధిలోని చెల్లాపూర్ , రాజక్కపేట, లచ్చపేట, రామక్కపేట, చీకోడ్, గంభీర్‌పూర్ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పర్యవేక్షకుల పోస్టులు, ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల విద్యారంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. ప్రభుత్వం వెంటనే బదిలీలు, ప్రమోషన్లు చేపట్టి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహరెడ్డి, నాయకులు తదితరులున్నారు.

నంగునూరు(సిద్దిపేట): రాష్ట్రంలో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కనకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పాలమాకుల, రాజగోపాల్‌పేట, బద్దిపడగ, అంక్షాపూర్, గట్లమల్యాల, కొండంరాజ్‌పల్లి పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి ఉపాధ్యాయుల సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు రాములు, సత్యనారాయణ, మండల అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి నరేశ్, రవి, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

మర్కూక్ పోలీస్‌స్టేషన్ సందర్శన

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు, సీసీ కెమెరాలు, రికార్డులను పరిశీలించారు. రాత్రి వేళలో పెట్రోలింగ్ బ్లూ కోల్ట్స్ విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. డయల్ 100కు కాల్ రాగానే వెంటనే స్పందించాలని హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ జానకిరాంరెడ్డి, ఎస్ఐ శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యం చేయించుకోవాలి

దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధిపై సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యం చేయించుకోవాలన్నారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ భార్గవి, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ మాధవి, పద్మనాభునిపల్లి సర్పంచ్ పర్శ రాములు పాల్గొన్నారు.

భవన నిర్మాణంపై రచ్చ



గ్రామస్తులకు నచ్చచెబుతున్న డీఈఈ, ఏఈ

దుబ్బాకరూరల్: మండలంలోని రాజక్కపేట పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు నిధులు మంజూరయ్యాయి. భవనం నిర్మాణానికి గ్రామ శివారులోని ప్రభుత్వ పాఠశాల ప్రక్కన స్థలం ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాల ప్రక్కనే నిర్మించాలని సర్పంచ్ పద్మపర్వతాలు ఆధ్వర్యంలో పాలక మండలి తీర్మానం చేశారు. అయితే కొంత మంది గ్రామ శివారులో నిర్మించకూడదని, పాత గ్రామ పంచాయతీ భవనం కూల్చిన స్థలంలో నిర్మించాలని పట్టుబట్టారు. గ్రామస్తుల మధ్య కొద్దిసేపు ఘర్షణ పడ్డారు. సంఘటనా స్థలానికి డీఈఈ విజయ్‌ప్రకాశ్, ఏఈ రిజ్వాన్ చేరుకుని ఇరు వారిని సముదాయించారు.

ఎంపీని కలిసిన బీఆర్ఎస్ నేతలు



ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని కలిసిన తొగుట గ్రామ బీఆర్ఎస్ నాయకులు

తొగుట(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికైన మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని తొగుట పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు కలిశారు. చేగుంట మండలంలో పర్యటనలో ఉన్న ప్రభాకర్‌రెడ్డిని మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘునందన్‌రావు తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను మోసంచేశాడన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ సభ్యుడు అనిల్ కుమార్, తొగుట మాజీ ఎంపీటీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): భూసార పరీక్షలు చేయించిన తరువాత పంటలు సాగు చేయాలని ఫర్టిలైజర్స్ ఇండియా అసోసియేషన్ సౌత్ జోన్ అధ్యక్షుడు మూర్తి సూచించారు. మండల పరిధిలోని మాచాపూర్ రైతువేదికలో సమగ్ర ఎరువుల యాజమాన్యంతో సుస్థిర వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. మట్టి పరీక్షలు చేయించి దానికి అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. నానో యూరియా వాడకంతో సమగ్ర ఎరువుల యాజమాన్యం అమలు పరచవచ్చన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఉమామహేశ్వరీ, శాంతి, ఎఫ్‌పీఓ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, సర్పంచ్ బాబు, రైతులు రాజారెడ్డి పాల్గొన్నారు.

చికత్స పొందుతూ మహిళ మృతి

గజ్వేల్‌రూరల్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్గల్ మండలం మైలారం గ్రామానికి చెందిన పోతగల్ల పద్మ(40)కు మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. నాలుగు రోజుల క్రితం గజ్వేల్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి



నివాళులర్పిస్తున్న రెడ్డి నాయకులు

దుబ్బాక: పేద విద్యార్థుల అభ్యున్నతికి హాస్టళ్లని నెలకొల్పి వారి విద్యాభివృద్ధికి రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి చేసిన సేవలు మరువలేనివని దుబ్బాక రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండవెల్లి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి 154వ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాంరెడ్డి, మల్లారెడ్డి, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గులాబీ తెగులు నివారించాలి

హుస్నాబాద్‌రూరల్: పత్తి పంటను ఆశించిన గులాబీ తెగులు నివారిస్తే దిగుబడులు పెరుగుతాయని కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం పందిల్ల రైతు వేదిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పత్తి పంటసాగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. రైతులకు పత్తి పంటను ఆశించే తెగుళ్ల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. జనవరిలో పత్తి చెట్లను తొలగించి దుక్కులు చేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాల మేరకు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ పి.మహేశ్, ఏఓ నాగరాజు, సర్పంచ్ తోడేటి రమేశ్, రైతులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో గృహలక్ష్మి పథకంలో 2,203 దరఖాస్తులు వచ్చాయి. గ్రామస్థాయిలో విచారణ అనంతరం మంగళవారం నుంచి ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి పర్యవేక్షణలో మండల పరిషత్ కార్యాలయంలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గృహలక్ష్మి పథకానికి అర్హత ఉన్నవారి వివరాలను మాత్రమే నమోదు చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఓటర్ ఐడీ కార్డులో ఏపీ అని ఉంటే ఆన్‌లైన్‌లో తీసుకోవడంలేదన్నారు.

పశువులకు టీకా వేయించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): రైతులు తమ పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలని డాక్టర్ మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని రాంసాగర్ గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలి కుంటు వ్యాధి సోకడం వల్ల పాల సామర్థ్యం తగ్గడంతో పాటు చూడి కట్టడం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్, చెట్టిపల్లి బాల్ రెడ్డి, మల్లారెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్కటూరు సర్పంచ్ మృతి

సిద్దిపేటఅర్బన్: మండలంలోని వెలకటూరు సర్పంచ్ మల్లమారి ఎల్లవ్వ (62) మంగళవారం మృతి చెందింది. మంత్రి హరీశ్‌రావు ఆమె కుటుంబానికి సానుభూతి తెలిపారు. సర్పంచ్ మృతికి ఎంపీటీసీ, వార్డు సభ్యులు సంతాపం ప్రకటించారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్థిక సాయం అందజేత**

మద్దూరు(హుస్నాబాద్): ఉమ్మడి మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి తన స్వగ్రామం సర్వాయపల్లి గ్రామానికి ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలకు రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నాడు. గ్రామస్తుడు ఆనందం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్ లలితతో కలిసి మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సత్యానారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదగిరి, శ్రీనివాస్, భాస్కర్, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

◆ **మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు**

గజ్వేల్‌రూరల్: మైనర్లు డ్రైవింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ తిరుపతి హెచ్చరించారు. పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బోర్డుల సూచనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే సమయంలో సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. రాంగ్‌రూట్లో ప్రయాణం ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. స్పీడ్ లేజర్‌గన్ పనిచేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రెగ్జిట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **పార్టీని చీల్చే కుట్ర**

మద్దూర్(హుస్నాబాద్): అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉందామని, ఇతరులు ఇచ్చే తాయిలాలకు ఆశపడి తల్లిలాంటి పార్టీని చీల్చొద్దని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలతతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. జనగామ నియోజకవర్గం అభివృద్ధి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితోనే సాధ్యమైందన్నారు. అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇచ్చినా భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి పార్టీని చీల్చే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

◆ **చెత్తబుట్టల ఏర్పాటు**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి గ్రామంలోని దుకాణాల వద్ద మంగళవారం సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగరావు చెత్తబుట్టలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఎలాంటి చెత్తను రోడ్డుపై వేయకుండా చెత్తబుట్టల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, అంగన్‌వాడి టీచర్లు, నాయకులు శ్రీనివాస్, రాములు, వెంకటస్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రజల సంక్షేమం కోసం కృషి**

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్ అన్నారు. మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ నాగరాజు శ్యామలతో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డీఎంఎఫ్‌టీ రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓరుగంటి అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

◆ **స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం**

చేర్యాల(సిద్దిపేట): గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే ఉల్లెంగుల సేవా ట్రస్ట్ లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగుల ఏకానందం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆకునూరులో ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సహకారంతో మహిళలకు ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్ ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చీపురు రేఖ, ఎంపీటీసీ సభ్యురాలు తొటసుధారాణి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు సుంకరి పద్మ పాల్గొన్నారు.

